సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025



పెరిగి.. తగ్గుతున్న మిర్చి ధర

నిల్వ మిర్చి ధర పెరిగి, తగ్గుతుండగా.. అమ్మితే పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేక రైతులు ఆవేదన చెందుతున్నారు. IIలో



పంటల్లో తెగుళ్ల బెడద

మారుతున్న వాతావరణంతో పంటలను ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తున్నారు. IIలో

గరిష్టం / కనిష్టం
32° / 21°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం, రాత్రి చలి ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి.

న్యూస్‌రీల్

నేడు జిల్లాకు డిప్యూటీ సీఎం

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం ఖమ్మంలో రానున్నారు. ఉదయం 10–30 గంటలకు ఖమ్మం చేరుకోనున్న భట్టి తొలుత అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. ఆతర్వాత 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌ శాఖపై అధికారులతో సమీక్షించనున్నారు.

నేడు, రేపు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్ర, శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం ఖమ్మం 22వ డివిజన్ ముస్తఫానగర్‌లో బీసీ హాస్టల్ భవనానికి శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత సాయంత్రం 5గంటలకు భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం నారంవారిగూడెంలో ఆయిల్ పామ్ మొలకలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారు. అలాగే, శనివారం ఉదయం రఘునాథపాలెం తహసీల్ సమీపాన చిల్డ్రన్స్ హోమ్ భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేస్తారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీ



కలెక్టర్‌తో మాట్లాడుతున్న రఘురాంరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి గురువారం కలెక్టరేట్‌లో కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు అందజేశారు. అలాగే, ఎంపీ నిధులతో చేపడుతున్న పనుల పురోగతి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ఎంపీ సమీక్షించారు.

ఖమ్మం రూరల్: రూరల్ మండలంలోని మారెమ్మ దేవస్థానం వద్ద జరిగిన పలు కార్యక్రమాలకు ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి హాజరయ్యారు. నాయకులు కొప్పుల చంద్రశేఖర్, ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, మొగిలిచర్ల సైదులు, విప్లవ్ కుమార్ పాల్గొన్నారు.

దర్యాప్తులో ఆధారాల సేకరణే కీలకం



ఫింగర్ ప్రింట్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం: నేరదర్యాప్తులో ఆధారాలు సేకరించడాన్ని కీలకంగా భావించాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. కమిషనరేట్ ఆవరణలో ఆధునికీకరించిన ఫింగర్ ప్రింట్ యూనిట్ కార్యాలయాన్ని గురువారం సీపీ పరిశీలించి మాట్లాడారు. ఫింగర్‌ప్రింట్ యూనిట్లలో ఆధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. పోలీసులు ఘటనాస్థలిలో సేకరించిన వేలిముద్రలను శాస్త్రీయ విశ్లేషణ ద్వారా పాత నేరస్తులు, అనుమానితుల వేలిముద్రలతో పోల్చిచూస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, ఏఆర్ ఏసీపీ సుశీల్‌సింగ్, సీఐలు, ఆర్‌ఐలు నరేష్, కామరాజు, సురేష్, బాలాజీ పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్‌కు సెలవులు

ఖమ్మంవ్యవసాయం: వారాంతపు సెలవులు, దీపావళి పండుగ సందర్భంగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా నాలుగు రోజుల సెలవులు ప్రకటించారు. ఈనెల 18 శనివారం , 19న ఆదివారం వారాంతపు సెలవులు కాగా, 20న సోమవారం నరక చతుర్దశి, 21వ తేదీ మంగళవారం దీపావళి సెలవు ప్రకటించినట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. తిరిగి 22వ తేదీ బుధవారం నుంచి మార్కెట్ కార్యకలాపాలు యదావిధిగా కొనసాగుతాయని ఆయన వెల్లడించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఖమ్మంక్రైం: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం(పోలీసు ఫ్లాగ్ డే)ను పురస్కరించుకుని విద్యార్థులకు ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో జరిగే పోటీల్లో 6వ తరగతి నుండి పీజీ వరకు విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు తమ వ్యాసాలను ఈనెల 28వ తేదీలోగా సమర్పిస్తే, జిల్లాలో ప్రతిభ కనబర్చిన ముగ్గురికి బహుమతులు అందించడంతో పాటు రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. వివరాల కోసం 87126 59256 నంబర్‌లో సంప్రదించాలని సీపీ సూచించారు.

సన్నగా.. దారి తప్పిస్తూ





జిల్లాలో స్వాధీనం చేసుకున్న బియ్యం వాహనం (ఇన్‌సెట్) వైరాలో పోలీసులకు పట్టుబడిన వ్యక్తి (ఫైల్)

బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్న రేషన్‌బియ్యం

- ఐదు నెలల్లో 6 'ఏ' కేసులు.. 29
- ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో 651క్వింటాళ్ల బియ్యం సీజ్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ప్రభుత్వం ఎన్ని మార్పులు చేసినా, ఎంత కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నా.. పలువురిపై కేసులు నమోదు చేసినా రేషన్ దందాకు మాత్రం అడ్డుకట్ట పడటం లేదు. సన్న బియ్యం పంపిణీ చేస్తే లబ్ధిదారులంతా తీసుకుంటారని, తద్వారా బియ్యం పక్కదారి పట్టే అవకాశం లేదని ప్రభుత్వం భావించింది. కానీ దీన్ని కూడా అక్రమార్కులకు వరంలా మార్చుకుని కొందరు డీలర్లు, దళారులు కలిసి యథేచ్ఛగా బియ్యాన్ని దారి మళ్లిస్తున్నారు. ఇంకొన్ని చోట్ల లబ్ధిదారులే బియ్యం అమ్ముకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మే నుంచి సెప్టెంబర్ వరకు జిల్లాలో పలు చోట్ల అక్రమంగా తరలిస్తున్న సన్నబియ్యం స్వాధీనంచ చేసుకుని 29 ఘటనల్లో 6 'ఏ' కేసులు నమోదు చేశారు.

దశాబ్దాలుగా ఇదే దందా..

రేషన్ బియ్యం రవాణా ఏళ్లుగా వ్యవస్థీకృత నేరంలా మారింది. పేదల కడుపు నింపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంపిణీ చేస్తున్న బియ్యం కొందరికి కాసులు కురిపిస్తోంది. గతంలో రేషన్ దుకాణాల ద్వారా దొడ్డుబియ్యం పంపిణీ చేయగా చాలా మంది లబ్ధిదారులు తినలేక డీలర్లు, వ్యాపారులకు విక్రయించే వారు. దీంతో ఇదే వ్యాపారంగా పెట్టుకున్న కొందరు సేకరించాక ప్రాసెస్ చేయించి అధిక ధరలకు విక్రయించేవారు. బడా వ్యాపారులైతే మిల్లర్లు, డీలర్లు, ఇతరుల నుంచి భారీ మొత్తంలో రేషన్ బియ్యం సేకరించి పాలిష్ అనంతరం జిల్లా నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ఓడ రేవులకు, ఆపై విదేశాలకు కూడా ఎగుమతి చేశారు. ఇలా పేదలకు పాలకులు అందించే రేషన్ బియ్యం అక్రమార్కులకు రూ.కోట్లు సంపాదించి పెట్టింది.

సన్న బియ్యంతోనూ..

పేద, మధ్య తరగతి ప్రజలు దొడ్డుబియ్యం తినలేక తీసుకోవడం లేదని.. పలువురు డీలర్లకే విక్రయిస్తున్నారని ప్రభుత్వం గుర్తించింది. తద్వారా దారి మళ్లుతోందని గుర్తించగా సన్నబియ్యం పంపిణీలో ఈ వ్యవహారానికి చెక్ పెట్టొచ్చని భావించింది. సన్నబియ్యమైతే అందరూ తింటారని, తద్వారా డీలర్ల వద్ద మిగలవని.. ఆపై అక్రమాలు జరగవని అంచనా వేసింది. మొదటి రెండు నెలలు ప్రభుత్వం అనుకున్నట్లుగా లబ్ధిదారులంతా బియ్యం తీసుకెళ్లగా ఎక్కడా దారి మళ్లిన ఆనవాళ్లు బయటపడలేదు. కానీ సన్నబియ్యంకు డిమాండ్ ఉండటం, ధర కూడా ఎక్కువగా వస్తుండడంతో లబ్ధిదారులు విక్రయించడం మొదలుపెట్టడంతో దళారులు మళ్లీ రంగంలోకి దిగి ఇతర ప్రాంతాలకు తరలించడం ఆరంభించారు.

ఎక్కడ వీలుంటే అక్కడ..

గతంలో దొడ్డు బియ్యం కేజీ రూ.10 లోపు విక్రయించగా.. సన్నబియ్యానికి వ్యాపారులు రూ.20 ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమాన కొందరు రేషన్ షాపుల్లో డీలర్లకే విక్రయిస్తుండగా, ఇంకొందరు తీసుకున్నాక వ్యాపారులు అప్పగిస్తున్నట్లు సమాచారం. అయితే, దందాకు ఎంఎల్‌ఎస్ పాయింట్లు కూడా కీలకంగా మారాయనే చర్చ జరుగుతోంది. కొందరు డీలర్లు ఇక్కడి నుంచి తీసుకెళ్లినట్లు రికార్డుల్లో నమోదు చేస్తున్నా బయటకు తీసుకెళ్లడం లేదని సమాచారం. తద్వారా వ్యాపారులు కొందరు లబ్ధిదారులు, డీలర్ల నుంచే కాక ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి సేకరించి వాహనాల్లో భారీగా సన్నబియ్యం రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది.

651 క్వింటాళ్లు సీజ్..

సన్నబియ్యం తరలిస్తున్న ఘటనలు వెలుగు చూడడంతో అధికారులు నిఘా కట్టుదిట్టం చేశారు. దీంతో కొన్నిచోట్ల బియ్యం పట్టుపడుతున్నా అక్రమంగా తరలించే బియ్యం అంత కంటే భారీగానే ఉంటుందని చెబుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది మే నెల నుంచి సెప్టెంబర్ వరకు టాస్క్‌ఫోర్స్ బృందాలు పలు మిల్లులు, రేషన్‌దుకాణాల్లో 28సార్లు తనిఖీ చేపట్టాయి. రేషన్ షాప్‌ల్లో బియ్యం నిల్వల్లో తేడా ఉన్నచోట నాలుగు కేసులు, బియ్యం అక్రమంగా తరలిస్తున్న వారిపై 25 కేసులు నమోదు చేశారు. ఆయా కేసుల్లో 651.60 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు. కాగా, ఈనెల 14న నేలకొండపల్లిలోని ఓ రైస్ మిల్లులో 600 క్వింటాళ్ల బియ్యాన్ని అనుమానంతో పౌర సరఫరాల సంస్థ అధికారులు సీజ్ చేశారు. అయితే, ఈ బియ్యం శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించగా పీడీఎస్ బియ్యం కాదని తేలింది.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం



ధాన్యం కాంటా వేస్తున్న హమాలీలు (ఫైల్)

- కల్లూరు మండలంలో తెరుచుకున్న రెండు కేంద్రాలు
- వరి కోతలు మొదలైన చోట్ల తొలుత ఏర్పాటు
- దశల వారీగా 326కేంద్రాల ప్రారంభానికి సన్నాహాలు

సాక్షిప్రతినిధి,ఖమ్మం: వానాకాలం వరి కోతలు జిల్లాలోని పలు చోట్ల మొదలయ్యాయి. నాగార్జున సాగర్ ఆయకట్టు ప్రాంతంలో బోర్లు, బావుల కింద సాగు చేసిన వరి ముందుగా కోతకు వస్తోంది. ఈనేపథ్యాన ఎక్కడ కోతలు మొదలైతే అక్కడ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేలా పౌర సరఫరాల సంస్థ అధికారులు సిద్ధమయ్యారు. వచ్చే నెల మొదటి వారం నాటికి జిల్లాలో మొత్తం 326 కేంద్రాలు ఏర్పాటుచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందులో భాగంగా కల్లూరు మండలంలోని ఎర్రబోయినపల్లి, పుల్లయ్యబంజరలో రెండు కేంద్రాలను గురువారం ప్రారంభించారు.

3.69 లక్షల మె. టన్నుల ధాన్యం సేకరణ

జిల్లాలో ఈ వానాకాలం సాగైన వరికి సంబంధించి 3,69,609 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని పౌర సరఫరాల సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యంలో 18,480 మెట్రిక్ టన్నులు దొడ్డు ధాన్యం, 3,51,129 మెట్రిక్ టన్నులు సన్న ధాన్యం ఉన్నాయి. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తుండడంతో సన్నధాన్యం సేకరణకే ప్రాధాన్యత ఇస్తున్నారు. జిల్లాలో 1,18,040 హెక్టార్లలో వరి సాగు కాగా 7,23,988 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో 51,971 మెట్రిక్ టన్నులు రైతుల అవసరాలు, విత్తనాల కోసం వినియోగిస్తారు. అలాగే, వ్యాపారులు, మిల్లర్లు 3,02,408 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తారనే భావనకు వచ్చారు. ఇక మిగిలిన మిగిలిన 3,69,609 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌర సరఫరాల సంస్థ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించనుంది.

దీపావళి తర్వాతే కోతలు

దీపావళి పండుగ అనంతరం.. అమావాస్య దాటాక జిల్లాలో వరి కోతలు ముమ్మరమయ్యే అవకాశముంది. సాగర్ ఆయకట్టుకు నీరు విడుదల చేయడంతో ఈ ఖరీఫ్‌లో ఎక్కువగా వరి సాగైంది. భారీ వర్షాలు పడడంతో సాగర్ నీటిని ఎలాగైనా విడుదల చేస్తారనే అంచనాతో ఆయకట్టులోని బోర్లు, బావుల కింద వేల ఎకరాల్లో ముందస్తుగా వరి సాగు చేశారు. నేలకొండపల్లి, కూసుమంచి, సత్తుపల్లి, కల్లూరు, ముదిగొండ, వైరాలో వరి ముందుగానే కోతకు వస్తోంది. ఈ ప్రాంతాల్లో కేంద్రాలను తొలుత తెరుస్తారు. ఆపై మిగతా చోట్ల వచ్చేనెల మొదటి వారం నాటికి కేంద్రాలు తెరవాలనే నిర్ణయానికి వచ్చారు. కాగా, జిల్లాలో 326 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేపడుతామని, ఇందులో 51 కేంద్రాల ద్వారా దొడ్డు రకం, 275 కేంద్రాల ద్వారా సన్న రకం ధాన్యం సేకరిస్తామని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలత 'సాక్షి'కి తెలిపారు.

శాఖల వారీగా ఏర్పాటుచేసే కేంద్రాలు, సేకరించే ధాన్యం

శాఖ	దొడ్డు రకం	సన్న రకం	మొత్తం
డీసీఎంఎస్	-	28	28
డీఆర్‌డీఏ	49	89	138
పీఏసీఎస్	2	155	157
మెప్మా	-	03	03
మొత్తం	51	275	326

మరో 45మంది టీచర్ల సర్దుబాటు

ఖమ్మం సహకారనగర్: పలు ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్లను కొరత తీర్చేందుకు అదనంగా ఉన్న చోట్ల నుంచి కేటాయిస్తున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టారు. తాజాగా మరో 45మందిని వివిధ పాఠశాలలకు కేటాయిస్తూ అదనపు కలెక్టర్, డీఈఓ డాక్టర్ పి.శ్రీజ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వీరంతా నూతన స్థానాల్లో వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు.

ఏఎంఓగా ప్రభాకర్‌రెడ్డి

విద్యాశాఖలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్(ఏఎంఓ)గా పెసర ప్రభాకరరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీజను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, ప్రభాకర్‌రెడ్డికి పలువురు హెచ్‌ఎంలు, వివిధ సంఘాల బాధ్యులు శుభాకాంక్షలు తెలిపారు.



అదనపు కలెక్టర్ శ్రీజకు మొక్క అందిస్తున్న ఏఎంఓ

టీటీడీ ఆలయ నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ

- స్థల అప్పగింతపై కార్యాచరణ
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ అనుదీప్

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం అర్బన్ మండలం అల్లీపురం సమీపాన తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యాన వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోవడమేకాక పర్యాటకం, ఉపాధి పరంగా అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన దేవాదాయ శాఖ స్థపతి ఎస్.వల్లీనాయగం, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి అల్లీపురం వద్ద గుర్తించిన 20 ఎకరాల స్థలం అప్పగింతపై దృష్టి సారించాలని సూచించారు. ఆలయ నిర్మాణమే కాక విడిది గృహాలు, వేద పాఠశాల, కల్యాణ మండపం , కళాక్షేత్రం, భజన మండపం, హెలీప్యాడ్ నిర్మాణానిక ప్రణాళిక రూపొందించాలని తెలిపారు.



ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

స్థల పరిశీలన

ఖమ్మం అర్బన్: టీటీడీ ఆధ్వర్యాన నిర్మించే ఆలయ కోసం అల్లీపురం–కొత్తగూడెం మధ్య గుర్తించిన స్థలాన్ని దేవాదాయ శాఖ స్థపతి వల్లీనాయగం, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆర్‌డీఓ నర్సింహారావు పరిశీలించారు. అక్కడ స్థలం వివరాలు ఆరా తీయడంతో పాటు నిర్మాణానికి ఉన్న అనుకూలతలపై చర్చించారు. ఈ కార్యక్రమాల్లో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎం.వీరస్వామి, డీఈ రమేష్‌బాబు, తహసీల్దార్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు, కండక్టర్ల కృషితోనే ఆర్టీసీ ఉన్నతి

కరీంనగర్ జోన్ ఈడీ పి.సోలమన్



అవార్డులు అందుకున్న ఉద్యోగులతో ఈడీ, ఆర్‌ఎం

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ అభివృద్ధికి డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు మూలస్తంభాలుగా నిలుస్తున్నారని.. సంస్థ ఉన్నతిలో వారి పాత్ర కీలకమని కరీంనగర్ జోన్ ఈడీ పి.సోలమన్ అన్నారు. రీజియన్ స్థాయి ప్రగతిచక్ర అవార్డులకు ఎంపికైన సిబ్బందికి ఖమ్మంలో గురువారం అవార్డులు అందజేశాక ఈడీ మాట్లాడారు. ఉద్యోగులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తే ప్రయాణికుల మన్ననలు పొందడంతో పాటు సంస్థ అభివృద్ధి బాట పడుతుందని తెలిపారు. ఆర్‌ఎం ఏ.సరిరామ్ మాట్లాడుతూ వివిధ కేటగిరీల డ్రైవర్లు 18మంది, కండక్టర్లు ఏడుగురు, మెకానిక్‌లు ముగ్గురు ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికయ్యారని చెప్పారు. అలాగే, రీజియన్‌లో ఉత్తమ బస్టాండ్‌గా వైరా బస్టాండ్ ఎంపికైందని ఆర్‌ఎం తెలిపారు.

డ్రా విజేతలకు బహుమతులు

దసరా సెలవుల్లో బస్సుల్లో ప్రయాణించిన వారి నుంచి ముగ్గురికి డ్రా ద్వారా ఎంపిక చేయగా విజేతలకు ఈడీ సోలమన్ బహుమతులు అందజేశారు. వరుసగా మూడు బహుమతులు సాధించిన ఎల్.కాంతారావు, సాయిబాబా, సునీల్‌కుమార్‌కు రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల చెక్కులు అందజేశారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, పర్సనల్ ఆఫీసర్ సంపత్‌తో పాటు డిపో మేనేజర్లు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మెరుగైన సేవలతో నమ్మకం

- వైద్యపరీక్షలకు బయటకు పంపితే చర్యలు
- ఆస్పత్రుల పనితీరుపై కలెక్టర్ అనుదీప్ సమీక్ష



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అనుదీప్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ తదితరులు

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందించడం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. జిల్లాలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల పనితీరుపై గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలందితే జిల్లా ఆస్పత్రిపై భారం తగ్గుతుందన్నారు. తిరుమలాయపాలెం, నేలకొండపల్లి ఆస్పత్రుల్లో మంచి ఫలితాలు రాగా, కల్లూరు, వైరా, సత్తుపల్లి , పెనుబల్లి, మధిర ఆస్పత్రులలో ఆశించిన పురోగతి లేదని తెలిపారు. సరిపడా వైద్యులు, సిబ్బంది ఉన్నా అతి తక్కువ ప్రసవాలు జరగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వీవీపీ ఆస్పత్రులో నెలకు కనీసం 200 ప్రసవాలు జరిగేలా వైద్యులు కృషి చేయాలని సూచించారు. అలాగే, డయాగ్నోస్టిక్ హబ్‌కు శాంపిళ్లు పంపాలే తప్ప ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదే సమయాన ఆస్పత్రులకు కావాల్సిన యంత్రాలపై ప్రతిపాదనలు సమర్పించాలని, మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు జరిగేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్, పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, సూపరింటెండెంట్లు, వైద్యులు పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తులు పరిష్కరించండి

ఖమ్మం సహకారనగర్: ఓటరు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించగా, కలెక్టరేట్ కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, కేఎంసీ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్డీఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఓటరు దరఖాస్తులను సత్వరమే పరిష్కరించడమే కాక ప్రతీ పోలింగ్ బూత్‌కు ఉద్యోగిని నియమించాలని, నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని తెలిపారు.

స్లాట్ బుకింగ్ విధానంలో పత్తి కొనుగోళ్లు

ఖమ్మంవ్యవసాయం: దళారుల సమస్యకు చెక్ పెట్టేలా రైతులే నేరుగా స్లాట్ బుక్ చేసుకుని సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. కేంద్రప్రభుత్వం రూపొందించిన కపాస్ కిసాన్ యాప్ ద్వారా ఆధార్ లింక్ అయిన మొబైల్ నంబర్ నుంచి స్లాట్ బుక్ చేసుకునేలా అధికారులు అవగాహన కల్పిస్తారని వెల్లడించారు. స్లాట్ బుక్ చేసుకున్న రోజు వెళ్లలేకపోతే 24 గంటల ముందు రద్దు చేసుకోవాలని, ఒక రైతు మూడుసార్లే రద్దు చేసుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.

పాడిగేదెలు పరిశీలన

మధిర/బోనకల్: మధిర నియోజకవర్గంలో ప్రభుత్వం ఏర్పాటుచేయనున్న ఇందిరా డెయిరీకి సన్నాహాలు చకచకా జరుగుతున్నాయి. మహిళా సంఘాల్లో సభ్యులను వాటాదారులుగా చేర్చగా మధిర, బోనకల్ మండలాల్లోని పలువురికి ఇప్పటికే రెండేసి పాడి గేదెలు పంపిణీ చేశారు. వీటిని ఇతర రాష్ట్రాల్లో కొనుగోలు చేసిన నేపథ్యాన జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖాధికారి బోడెపూడి శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన గేదెలకు మేత, పోషణ వివరాలు ఆరా తీయడంతో పాటు పాల దిగుబడి వివరాలు సేకరించారు. అలాగే, గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. మండల పశు వైద్యాధికారులు వై.అన్వేష్, శ్రీహరి, ఉమాకుమారి, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

'సీతారామ'పై సమీక్ష

కల్లూరు: సీతారామ ఎత్తిపోతల పథకం భూసేకరణ, నిర్మాణాలపై అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి సమీక్షించారు. కల్లూరులో గురువారం ఆయన సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పెండింగ్ భూసేకరణ, నీటి సరఫరాకు ఉన్న అవకాశాలపై చర్చించి సూచనలు చేశారు. వివిధ మండలాల తహసీల్దార్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పారదర్శకంగా జిల్లా అధ్యక్ష ఎన్నిక

ఏఐసీసీ పరిశీలకుడు మహేంద్రన్



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు మహేంద్రన్

వైరా/ఏన్కూరు: కాంగ్రెస్ పార్టీలో అనుభవంతో పాటు పార్టీ అభివృద్ధికి పాటు పడే నాయకులనే అధ్యక్ష పదవికి ఎంపిక చేస్తామని, ఇదంతా పారదర్శకంగా సాగుతుందని ఏఐసీసీ పరిశీలకుడు కె.మహేంద్రన్ స్పష్టం చేశారు. వైరా, ఏన్కూరులో గురువారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక కోసం నిర్వహించిన ఏ, బీ బ్లాక్ కార్యకర్తల సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిప్రాయాలు సేకరించాక మహేంద్రన్ మాట్లాడారు. కార్యకర్తల అభిప్రాయ సేకరణ తర్వాతే అధ్యక్షులను ఎన్నుకోవాలన్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సూచనతో సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈమేరకు పార్టీలో క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసిన వారికే పదవులు దక్కుతాయని చెప్పారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని మహేంద్రన్ సూచించారు. అనంతరం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడగా డీసీసీ ఎన్నికల ఇన్‌చార్జి రవళిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, నాయకులు నూతి సత్యనారాయణ, బొర్రా రాజశేఖర్, సూతకాని జైపాల్, బానోత్ బాలాజీ, అనుమోలు కృష్ణార్జునరావు, కట్ల రంగారావు, ఏదునూరి సీతారాములు, శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డె నారాయణరావు, సూరంపల్లి రామారావు, దార్న రాజశేఖర్, మిట్టపల్లి నాగి, కోసూరి శ్రీను, స్వర్ణ నరేంద్ర, మంగీలాల్, చంద్రప్రకాశ్, గుగులోత్ లచ్చిరామ్, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, వేముల కృష్ణప్రసాద్, లేళ్ల వెంకటరెడ్డి, గుత్తా వెంకటేశ్వరరావు, కొప్పుల ప్రభావతి, లాలూనాయక్, గాలీబ్, హరిలాల్, నాగేశ్వరరావు, శేఖర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు

క్లుప్తంగా

నాకు బిల్లు రాలేదు సార్..

మంత్రి పొంగులేటికి 'ఇందిరమ్మ' లబ్ధిదారుడి ఫోన్



మంత్రితో ఫోన్‌లో మాట్లాడుతున్న తోట దాసు

ముదిగొండ: తొలుత నిర్మించిన తన కంటే ఆతర్వాత ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న పలువురికి బిల్లులు మంజూరు కావడంపై ఓ లబ్ధిదారుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ముదిగొండ మండలం బాణాపురానికి చెందిన దివ్యాంగుడైన తోట దాసుకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా నిర్మాణం మొదలుపెట్టాడు. అయితే, మొదటి బిల్లు సైతం అందకపోగా ఆ తర్వాత నిర్మాణం మొదలుపెట్టిన వారికి బిల్లులు జమ అయ్యాయి. దీంతో గురువారం దాసు ఆవేదనగా రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఫోన్ చేశాడు. ఈమేరకు స్పందించిన మంత్రి పొంగులేటి శనివారం తాను ఖమ్మం వస్తున్నానని.. ఆ రోజు తనను కలవాలని సూచించాడు. కాగా, మంత్రితో దాసు ఫోన్‌లో మాట్లాడిన ఆడియాలో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది.

19న రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ



ట్రోఫీలతో మేయర్, నిర్వాహకులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఈనెల 19న రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల చెస్ టోర్నీ నిర్వహించనున్నారు. టోర్నీలో విజేతలకు ఇచ్చే ట్రోఫీలను ఖమ్మం మేయర్ పి.నీరజ గురువారం ఆవిష్కరించారు. కార్పొరేటర్లు రాపర్తి శరత్, మలీదు వెంకటేశ్వర్లు, టోర్నీ ఆర్గనైజర్ టి.వీరన్న, కోచ్‌లు రఫీ, కావ్య, శివకృష్ణ, హుస్సేన్ పాల్గొన్నారు. కాగా, పోటీల వివరాల కోసం 83281 02378, 94913 57631నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

19న బ్యాడ్మింటన్, కరాటే క్రీడాకారుల ఎంపిక


ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా జూనియర్ కళాశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన ఈనెల 19వ తేదీన ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-19 బ్యాడ్మింటన్ జట్టు, కరాటే క్రీడాకారులను ఎంపిక చేయనున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను ఈ సందర్భంగా ఎంపిక చేయనున్నట్లు క్రీడల సంఘం కార్యదర్శి ఎం.డీ.మూసా కలీం వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు వయసు ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 19న ఉదయం 10గంటకు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

108 వాహనంలో ప్రసవం

తల్లాడ: అర్ధరాత్రి వేళ పురిటి నొప్పులతో బాధపడుతున్న నిండు గర్భిణిని 108లో తరలిస్తుండగా మార్గమధ్యలో మహిళ ప్రసవించింది. మండల కేంద్రానికి 20కి.మీ. దూరాన ఉన్న కుర్నవల్లికి చెందిన ఇనుపనూరి రమ్యకు నెలలు నిండడంతో బుధవారం రాత్రి పురిటి నొప్పులు మొదలయ్యాయి. ఈమేరకు ఆశా కార్యకర్త ఎక్కిరాల రామలక్ష్మి ఫోన్ చేయగా 108 సిబ్బంది నల్లగట్ల రామారావు, ముళ్లపాటి నరసింహారావు చేరుకున్నారు. ఆపై వాహనంలో రమ్యను కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగానే నొప్పులు పెరగడమే కాక ఉమ్మనీరు తక్కువగా ఉందనీ, మెడ చుట్టూ బొడ్డు తాడు చుట్టుకుపోయిందని గుర్తించారు. దీంతో 108 జిల్లా మేనేజర్ అవులూరి దుర్గాప్రసాద్, ప్రోగ్రామ్ మేనేజర్ పాటి శివకుమారస్వామి, వైద్యుల సూచనలతో రమ్యకు వాహనంలో ప్రసవం చేయగా ఆడశిశువు జన్మించింది. ఆతర్వాత తల్లీబిడ్డలను కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పిన 108 సిబ్బందిని పలువురు అభినందించారు.

'ఆరోగ్య మహిళ' అమలుపై ఆరా

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా జనరల్ ఆస్పత్రిలో అమలవుతున్న ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, వైద్య ఆరోగ్యశాఖ అదనపు రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ శశిశ్రీ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళలకు పరీక్షలు, వ్యాధుల నిర్ధారణ, చికిత్సల వివరాలు తెలుసుకున్నారు. అలాగే, మెరుగైన సేవలకు సూచనలు చేశారు. మహిళల ఆరోగ్య రక్షణ, వ్యాధుల ప్రాథమిక నిర్ధారణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేయాలని తెలిపారు. చికిత్సతో పాటు వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి, మెడికల్ సూపరింటెండెంట్ ఎంనరేందర్, అధికారులు రామారావు, ప్రేమలత పాల్గొన్నారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.19,400

పెరిగి.. తగ్గుతున్న మిర్చి ధర



మధిర మార్కెట్‌లో మిర్చి శాంపిళ్లు పరిశీలిస్తున్న వ్యాపారులు

- ఇతర రాష్ట్రాల్లోనూ తేజ రకం సాగు
- మరోపక్క విదేశాలకు తగ్గిన ఎగుమతులు
- ఫలితంగా కోల్డ్ స్టోరేజీలు దాటని నిల్వలు

మధిర: మార్కెట్‌లో ప్రస్తుతం మిర్చి ధర నిలకడగా ఉంది. ఓ వారం క్వింటాకు రూ 500 పెరుగుతుండగా మరో వారం తగ్గుతోంది. రెండేళ్లుగా కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసిన మిర్చిని రైతులు ఇప్పుడు తప్పనిసరై విక్రయిస్తున్నారు. మరో రెండు నెలలు గడిస్తే ఈ ఏడాది సాగు చేసిన మిర్చి చేతికి రానుండడంతో చేసేదేం లేక.. ధర రాకున్నా అమ్ముతున్నారు. దీనికి తోడు ఈ ఏడాది పంటల పెట్టుబడికి డబ్బు అవసరం కావడంతో తక్కువ ధరకైనా అమ్మాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

ఎగుమతులు లేక..

తెలుగు రాష్ట్రాల్లో పండిన తేజ రకం మిర్చి చైనా, బంగ్లాదేశ్, మలేషియా తదితర దేశాలకు ఎగుమతి అవుతుంది. ఇక్కడ పండే పంట ఎక్కువగా చైనాకు ఎగుమతి చేస్తారు. కానీ ఈసారి ఎగుమతుల ఆర్డర్లు లేవంటూ వ్యాపారులు కొనడానికి ముందుకు రావడం లేదు. దీంతో గత ఏడాది సాగు చేసిన మిర్చి ధర పెరుగుతుందనే ఆశతో నిల్వ చేసిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. దీంతో ప్రస్తుత జిల్లా మార్కెట్లలో క్వింటా మిర్చికి రూ.11వేల నుంచి రూ.14,500 ధర పలుకుతోంది. జెండా పాట రూ.14వేలుగా నమోదవుతున్నా ఆ ధరతో కొనుగోళ్లు జరగడం లేదని చెబుతున్నారు. మధిర, ఖమ్మం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు తదితర మార్కెట్లలోనూ తేజ రకం క్వింటా రూ.15 వేల ధరే ఉంది.

అయినా కొనడం లేదు...

ధర తక్కువగానే ఉన్నా ఎగుమతిదారులు కొనడం లేదు. గతంలో కొని చైనాలో నిల్వ చేసిన మిర్చిని ఇప్పుడు వినియోగిస్తుండడమే ఎగుమతులు లేకపోవడానికి కారణంగా చెబుతున్నారు. దీనికి తోడు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్ తదితర రాష్ట్రాల్లోనూ మిర్చి సాగు పెరగడం.. అక్కడ తేజ రకాన్ని పోలిన మిర్చి సాగవుతుండడంతో తక్కువ ధరకే కొంటున్నట్లు సమాచారం. జిల్లాలో 42 కోల్డ్ స్టోరేజీలు ఉండగా సుమారు 30లక్షల బస్తాల మిర్చి నిల్వలు ఉన్నాయి. అయితే, జిల్లాలో నిల్వ ఉన్న మిర్చి అమ్ముడయ్యే వరకు ధర పెరిగే పరిస్థితి లేదని వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. కాగా, వివిధ కారణాలతో మిర్చి దిగుబడి, ధర తగ్గడంతో ఈసారి జిల్లాలో మిర్చి సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. గత ఏడాది జిల్లాలో 59వేల ఎకరాల్లో సాగైతే ఈ ఏడాది 25వేల ఎకరాల్లోనే సాగవడం గమనార్హం.

సగం ఖర్చులు కూడా రాలే..



రెండేళ్ల క్రితం సాగైన మిర్చిని కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేశా. ఇప్పుడు పెట్టుబడికి అవసరమై అమ్మేందుకు తీసుకొచ్చా. రెండేళ్ల క్రితం రూ.20వేలకు అడిగితే ఇప్పుడు రూ.12,500కే తీసుకున్నారు. దీంతో పెట్టుబడి సగం కూడా రాలేదు.

– గంధం రామకృష్ణ, మిర్చి రైతు

పెట్టుబడి కోసం అమ్ముకున్నా..



ఈ ఏడాది సాగవుతున్న పంటలకు పెట్టుబడి కావాలి. ధర వస్తుందనే ఆశతో కోల్డ్ స్టోరేజీలో 10 నెలల క్రితం మిర్చి నిల్వ చేశా. కానీ ఇప్పుడు రూ.14 వేలకే అమ్మడంతో నష్టం వచ్చింది. అందుకోసమే ఈసారి మిర్చి సాగే చేయలేదు.

– డి.కృష్ణ, మిర్చి రైతు

ఎగుమతులు అరకొరగానే..



విదేశాలకు మిర్చి ఎగుమతులు అరకొరగా ఉన్నాయి. కోల్డ్ స్టోరేజీలో 70శాతం సరుకు ఉండడం.. మరోపక్క ఎగుమతులు తగ్గడంతో రేటు పెరగడం లేదు. నిత్యావసరాలకు పచ్చిమిర్చి వినియోగం పెరగడం కూడా ఓ కారణమే.

– కళ్యాణపు పుల్లారావు, మిర్చి వ్యాపారి

'నాన్నే నా హీరో' పుస్తక ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాగమయి దయానంద్, తదితరులు

సత్తుపల్లిరూరల్: నిరుపేద కుటుంబం నుంచి వచ్చినా అద్భుతమైన కథలు రాసిన సత్తుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి ఆవుల పోతురాజు మరికొందరికి స్ఫూర్తిగా నిలుస్తాడని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. విద్యార్థి రాసిన 20 కథలతో గార్లపాటి-బొల్లేపల్లి ట్రస్ట్ ఆధ్వర్యాన 'నాన్నే నా హీరో' శీర్షికన పుస్తకాన్ని ముద్రించారు. ఈ పుస్తకాన్ని రాగమయి దయానంద్ గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. పిల్లల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే పోతురాజు వంటి మరికొందరు బయటకు వస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థి, ఆయన తల్లి తిరుపతమ్మ, ఉపాధ్యాయులు ఎం.రమాదేవి, వెంకటాచార్యులు, హెచ్‌ఎం సోదు షేక్, పుస్తకాన్ని ప్రచురించిన రామకృష్ణ, బి.మధుసూదన్‌రాజును సత్కరించారు. కార్యక్రమంలో రామిశెట్టి శ్రీనివాసరావు, పసుపులేటి నాగేశ్వరరావు, మహమ్మద్ షాకీర్ హుస్సేన్, గోలి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర బంద్‌కు అఖిలపక్షం మద్దతు

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



అభివాదం చేస్తున్న అఖిలపక్షం నాయకులు

సత్తుపల్లి/సత్తుపల్లిటౌన్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 18న చేపడుతున్న రాష్ట్ర వ్యాప్త బంద్‌కు అఖిపక్షం మద్దతు ఇచ్చిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు అన్నివర్గాల ప్రజలు సహకరించి బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. సత్తుపల్లిలో గురువారం ఆయన మాట్లాడారు. అన్ని వర్తక, వాణిజ్య, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు బంద్‌కు సహకరించాలన్నారు. నాయకులు దండు ఆదినారాయణ, పాండు, రఫీ, గాదె చెన్నారావు, శరత్, రంగారావు, మరికంటి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, సందీప్, చల్లారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కాగా, బీసీ సంక్షేమ సంఘం తలపెట్టిన బంద్‌కు బీజేపీ మద్దతు ప్రకటిస్తోందని ఆ పార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు తెలిపారు. సత్తుపల్లిలో ఆయన మాట్లాడగా, నాయకులు రమేష్, నాయుడు రాఘవరావు, విజయ్, శివకృష్ణ, నరేష్, వీరంరాజు, సుదర్శన్ మిశ్రా, సురేందర్‌రెడ్డి, కృష్ణయ్య, శ్రీను, రాంబాబు పాల్గొన్నారు.

హోటల్‌లో బూజు పట్టిన చట్నీ

నిర్వాహకులకు రూ.10 వేల జరిమానా



అపరిశుభ్ర వాతావరణంలోని కిచెన్‌ను పరిశీలిస్తున్న ఉద్యోగి


ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో ఆహార తనిఖీ అధికారుల నిర్లక్ష్యం ప్రజల ఆరోగ్యం పాలిట శాపంగా మారుతోంది. అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తుండడంతో జిల్లా కేంద్రంలోని కొందరు హోటళ్ల నిర్వాహకులు అపరిశుభ్ర వాతావరణంలోనే నిర్వహించడంతో పాటు నిల్వ ఉండి, ఫంగస్ వచ్చిన పదార్థాలనే వినియోగిస్తున్నారు. కొద్దిరోజులుగా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను అరికట్టడానికి తనిఖీలు చేపడుతున్న కేఎంసీ శానిటేషన్ ఉద్యోగులు గురువారం రాపర్తినగర్ వద్ద ఓ టిఫిన్ సెంటర్‌లో పరిశీలించారు. శానిటరీ సూపర్‌వైజర్ ఎం.సాంబయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తనిఖీల్లో పాల్గొనగా ఆ హోటల్‌లోని ఫ్రిడ్జ్ తలుపులకు ఫంగస్ రాగా, నిల్వ ఉన్న చట్నీలోనూ బూజు వచ్చినట్లు గుర్తించారు. ఈ మేరకు హోటల్ నిర్వాహకులకు రూ.10 వేల జరిమానా విధించి, తీరు మార్చుకోకుంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే, పలు షాపుల్లో నిషేధిత ప్లాస్టిక్‌ను సీజ్ చేసి పది దుకాణదారులకు రూ.42వేల జరిమానా విధించారు.

డీసీఎంను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ఎనిమిది మందికి గాయాలు

కొణిజర్ల: ముందు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఎనిమిది మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. భద్రాద్రి జిల్లా మణుగూరు నుండి ఖమ్మం వస్తున్న ఆర్‌టీసీ బస్సు కొణిజర్ల పోలీస్‌స్టేషన్ సమీపాన ముందు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న భూక్యా లక్ష్మి, వడ్డె గిరి, వేము వాణి, కొత్తకోట భిక్షపతి, ఉప్పలయ్య, భాస్కర్, దుర్గాభవాని, భూక్యా బిందుకు గాయాలయ్యాయి. వీరిని 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించినట్లు కొణిజర్ల ఎస్ఐ సూరజ్ తెలిపారు.

బస్సు కిందకు దూసుకెళ్లిన స్కూటీ



బస్సు కింద ఉన్న స్కూటీ

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు స్కూటీ బస్సు కిందకు దూసుకెళ్లగా యువకుడు తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. మండలంలోని గువ్వలగూడెంకు చెందిన మహేష్ గురువారం స్కూటీపై నేలకొండపల్లి రాగా, పాట్టి శ్రీరాముల సెంటర్‌లో మలుపు తిరుగుతుండగా కోదాడ నుంచి ఆర్టీసీ బస్సు ఖమ్మం వెళ్తోంది. ప్రమాదవశాత్తు బస్సు కిందకు స్కూటీకి దూసుకెళ్లగా మహేష్ పక్కకు దూకడంతో రెప్పపాటులో ప్రమాదం తప్పినట్లయింది.

వీసాలు ఇప్పిస్తానని మోసం

15 మంది నుంచి రూ.70 లక్షల వసూలు

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలంలోని నారాయణపురం, రాజుపాలెం గ్రామాల యువకులను విదేశాలకు పంపిస్తానంటూ వీసాల పేరిట నగదు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై గురువారం కేసు నమోదైంది. ఏపీ రాష్ట్రం శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన మోట్ల అభినవ్‌కుమార్ హైదరాబాద్‌లో కార్యాలయం ఏర్పాటుచేశాడు. ఆయనకు ఎర్రుపాలెం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన వేముల సురేష్‌కు అభినవ్ పరిచయం కాగా.. జార్జియా దేశంలోని హాస్టళ్లలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికాడు. దీంతో రూ.4లక్షలు చెల్లించిన సురేష్ ఈ విషయాన్ని తన స్నేహితులు, బంధువులకు చెప్పాడు. ఈమేరకు నారాయణపురం, రాజుపాలెం గ్రామాలకు చెందిన 15మంది యువకులు రూ.4లక్షల నుంచి రూ.5లక్షల వరకు మొత్తం రూ.70లక్షల వరకు అభినవ్ వసూలు చేశాడు. ఆపై వీసాలు ఇప్పించడంలో జాప్యం చేస్తుండగా అనుమానంతో ఒత్తిడి చేశారు. దీంతో ఆయన ముఖం చాటేయగా మోసపోయామని గ్రహించిన బాధితుల ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసినట్లు ఎర్రుపాలెం ఎస్ఐ రమేష్ తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తులకు వైద్యసాయం

ఖమ్మం అర్బన్: ఖమ్మంలోని అన్నం సేవా ఫౌండేషన్‌లో మతిస్థిమితం లేని గుర్తుతెలియని వ్యక్తులకు కొన్నాళ్లుగా ఆశ్రయం కల్పిస్తున్నారు. ఆరుగురికి మెరుగైన వైద్యం అందేలా గురువారం పోలీసుల సమక్షాన ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయించినట్లు ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. ఆతర్వాత కోర్టు అనుమతి తీసుకుని పోలీసు సిబ్బంది సాయంతో వారికి మెరుగైన వైద్యం కోసం ఎర్రగడ్డలోని మానసిక వైద్యశాలకు తరలించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది సుధాకర్ పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ఆరుగురి అరెస్ట్

సత్తుపల్లి: గంజాయి పీలుస్తున్న ఆరుగురిని సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. సత్తుపల్లి మండలానికి చెందిన జె.సింహాద్రి, కె.రంజిత్ తమ స్నేహితులైన ఎస్.రాజేష్, అశోక్‌తో కలిసి ఒడిశా వెళ్లి మధు అనే వ్యక్తి వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేశారు. ఈ గంజాయిని సింహాద్రి వద్ద దాయగా, గురువారం పీల్చేందుకు రేజర్ల సమీపాన డంపింగ్ యార్డ్ సమీపానికి రంజిత్, పవన్ సాయి, శ్రీనాథ్, స్వామి, రక్షక్ వచ్చారు. అదేసమయాన పెట్రోలింగ్‌కు వెళ్లిన చూసిన పోలీసులను చూసి పారిపోతుండడంతో అదుపులోకి తీసుకుని తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 320 గ్రాముల గంజాయి, నాలుగు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సత్తుపల్లి సీఐ శ్రీహరి తెలిపారు.

అప్పుల బాధతో స్నేహితుల ఆత్మహత్యాయత్నం

ఎర్రుపాలెం: ఇద్దరు స్నేహితులు వేర్వేరు కారణాలతో అప్పులు చేయగా, ఆర్థిక సమస్యలు ఎదురవడంతో ఒకేసారి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని ములుగుమాడుకు చెందిన షేక్ జానీ సైదులు గ్రామంలో వ్యవసాయం చేస్తుంటాడు. వ్యవసాయం, కుటుంబ ఖర్చుల నిమిత్తం దాదాపు రూ.3లక్షల వరకు అప్పు చేశాడు. ఆయన స్నేహితుడు, గ్రామంలో సెలూన్ నడిపే ఆముదాల రాము దాదాపు రూ.80వేల అప్పు చేశాడు. ఆర్థిక సమస్యల కారణంగా అప్పులు తీర్చలేని పరిస్థితి ఎదురుకావడం, రుణదాతలు ఒత్తిడి చేస్తుండడంతో మీనవోలు-తొర్లపాడు మధ్య రైల్వే గేటు సమీపాన గురువారం గడ్డి మందు తాగారు. కాసేపటి గుర్తించిన స్థానికులు ఇచ్చిన సమాచారంతో కుటుంబీకులు వారికి మధిరలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. వీరిలో సైదులుకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉండగా, రాముకు ఇంకా వివాహం కాలేదు. ఈవిషయమై ఎస్ఐ రమేష్‌ను వివరణ కోరగా ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఆర్‌ఎంపీ ఆత్మహత్య..

ఖమ్మంక్రైం: ఓ ఆర్‌ఎంపీ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఖమ్మం దానవాయిగూడెం ప్రాంతానికి చెందిన ఎం.నాగాచారి(46) ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన జీవితంపై విరక్తి చెంది రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. నాగాచారి భార్య, పిల్లలు ఉన్నారు. కాగా, ఆయన మృతదేహన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు సహకారంతో ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఖమ్మం రైల్వే పోలీసులు తెలిపారు.

పంటల్లో తెగుళ్ల బెడద



బ్యాక్టీరియా ఎండు తెగులు ఆశించిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

- దిగుబడిపై రైతుల్లో ఆందోళన
- యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తల సలహాలు



డాక్టర్ టి.భరత్, కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): వాతావరణ పరిస్థితుల్లో రోజుకో రకంగా ఉంటున్నాయి. కొద్ది రోజుల పాటు ఎడతెగకుండా వర్షాలు కురిశాయి. ప్రస్తుతం మధ్యాహ్నం ఎండగా ఉంటున్నా సాయంత్రం మంచుప్రభావం కనిపిస్తోంది. ఈ నేపథ్యాన వివిధ పంటలను తెగుళ్లు ఆశిస్తుండగా దిగుబడిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈమేరకు వివిధ పంటల్లో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డి నేటర్ డాక్టర్ టి.భరత్ వెల్లడించారు.

వరి

అధిక తేమతో కూడిన వాతావరణం వరిలో మానుపండు తెగులు సోకడానికి అనుకూలం. ఈ లక్షణాలు కనిపిస్తే ఆకాశం నిర్మలంగా ఉన్నప్పుడు 0.4గ్రాములు + ట్రైఫోసెక్సీస్ట్రైబిన్ టెబుకోన జోల్ లేదా ఒక ఎం.ఎల్. ప్రొపికోనజోల్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పంటలో పాము పొడ తెగులు లక్షణాలు గమనిస్తే వర్షాలు తగ్గాక ఒక మి.లీ. ప్రొపికోనజోల్‌ను లీటర్ నీటిలో కలిపి 15 రోజులు వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. అలాగే, వరిలో సుడిదోమ ఆశిస్తే నివారణకు వర్షాలు తగ్గిన తర్వాత 0.6 గ్రాముల పైమెట్రోజిన్ లేదా 0.48 మి.లీ. టిప్లోమేజపైరిన్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఇంకా కంకి నల్లి ఆశిస్తే ఒక మి.లీ. స్పైరోమైసిపిన్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అలాగే, బాక్టీరియా ఎండు తెగులు ఉధృతి కనిపిస్తే ఎకరానికి 400 గ్రాముల కాపర్ హైడ్రాక్సైడ్, స్టేప్టోమైసిన్ సల్ఫేడ్ 60 గ్రాములు అందిస్తూ.. యూరియా మోతాదును తగ్గించి నీటిని తడి – పొడి విధానంలో అందించాలి. అయితే, ఈ తెగులుకు పూర్తిగా నివారించడానికి సరైన మందులు లేవు.

పత్తి

ప్రస్తుత వాతావరణ పరిస్థితిలో పత్తిలో గులాబీ రంగు పురుగు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు 2 మి.లీ. ప్రొఫినోఫాస్ లేదా 1.5 గ్రాముల దియోడికార్బ్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అలాగే, ఎకరానికి 5 – 6 లింగాకర్షణ బుట్టలు అమరిస్తే పురుగు ఉధృతిని తగ్గించవచ్చు. అలాగే, పత్తిలో కాయకుళ్లు లక్షణాలు గమనిస్తే వర్షాలు తగ్గాక 0.2 గ్రాముల ప్లాంటమైసిన్ + 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి

అపరాలు

వెచ్చటి గాలి, అధిక తేమ వాతావరణ పరిస్థితుల్లో కంది, పెసర, మినుము పంటలను మారుకా మచ్చల పురుగు ఆశించే అవకాశం ఉంది. ఈ పురుగు ఆనవాళ్లను గమనిస్తే వర్షాలు తగ్గిన తర్వాత నివారణకు ఒక మి.లీ. నోవాలురాన్ లేదా 0.4 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి

కూరగాయలు

- టమాట పంటలో సూది పురుగు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు 0.3 మి.లీ. స్పైనోసాడ్ లేదా 0.2 మి.లీ. ఇండాక్సికార్బ్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఇక వంగలో కొమ్మ, కాయ తులసి పురుగు ఆశిస్తే 0.4 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి

పీడీఎస్‌యూ మహాసభల ఆహ్వాన కమిటీ ఎన్నిక



మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: మతం పేరుతో ప్రజల విభజనకు జరుగుతున్న కుట్రలను యువత, విద్యార్థులు అడ్డుకోవాలని టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి మనోహర్‌రాజు సూచించారు. డిసెంబర్‌లో పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు జరగనుండగా ఖమ్మంలో గురువారం రాష్ట్ర అధ్యక్షుడు కంపాటి పృథ్వీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పోస్టర్లు ఆవిష్కరించి ఆహ్వాన సంఘం కమిటీని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా మనోహర్‌రాజు మాట్లాడుతూ నూతన విద్యావిధానం పేరుతో విద్యావ్యవస్థల్లో మత రాజకీయాలను జొప్పించేలా కేంద్రం యత్నిస్తోందని విమర్శించారు. ఇక ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సైతం విద్యారంగ సమస్యలను పరిష్కరించడం లేదని చెప్పారు. అనంతరం ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడిగా వైవీ.రమణరావు, అధ్యక్షుడిగా వి.మనోహర్ రాజు, ప్రధాన కార్యదర్శిగా కాంపాటి పృథ్వీ, రాష్ట్ర కోశాధికారిగా ఆవుల అశోక్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్‌తోపాటు పోటు రంగారావు, వద్దెల్లి కృష్ణమూర్తి, ఐవీ.రమణ, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి..

సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: అతివృష్టితో జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ వర్షాలతో దిగుబడి పడిపోగా, ధర కూడా లేనందున రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ఈ విషయమై శుక్రవారం నుంచి 21వ తేదీ వరకు పంటలను పరిశీలించి, ఆతర్వాత మూడు రోజులు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. అప్పటికి కూడా ప్రభుత్వం స్పందించకోతే 30వ తేదీన కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని చెప్పారు. కాగా, బీసీల రిజర్వేషన్ పెంపుపై బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని నున్నా నాగేశ్వరరావు ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు బి.రమేష్, కె.వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థుల సృజనాత్మకకు వేదిక

నేడు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎకో బజార్

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యాన కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ సహకారంతో రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 'ఎకో ఫ్రెండ్లీ బజార్' ఏర్పాటుచేస్తున్నారు. ఇందుకోసం ప్రతీ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎంచుకున్నారు. ఇందులో భాగంగా ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఎకో బజార్ ఏర్పాటుచేయనున్నారు.

విద్యార్థులు ప్రతిభ చాటేలా

మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న ఎకో బజార్‌లో విద్యార్థులు తమ ఆలోచనల నుంచి రూపొందించిన ఉత్పత్తులను ప్రదర్శిస్తారు. తక్కువ ఖర్చుతో బృందాలుగా రూపొందించిన ఉత్పత్తుల్లో పూజా వస్తువులు, అలంకరణ సామగ్రి, పిండివంటలు తదితర వస్తువులు ఉన్నాయి. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు సృజనాత్మకత, పర్యావరణ చైతన్యం, మార్కెటింగ్ నైపుణ్యాలు పెంపొందుతాయని కాలేజీ ప్రిన్సిపాల్ బానోతు రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రవిశంకర్ తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ IV
ఖమ్మం
శుక్రవారం ॥ 17-10-2025



- 'సాక్షి' ఫ్యామిలీతో మహిళా ఐపీఎస్‌ల మనోగతం

అమ్మ... నాన్న... నాలుగో సింహం





“రోజుకు 5 నుండి 7 గంటలు తలను ఫోన్ ముందు వంచి గడపడాన్ని 'టెక్స్ట్ నెక్' అని పిలుస్తున్నారు. టెక్స్ట్ నెక్ అనేది మెడలోని కండరాలు, నరాలను ఒత్తిడికి గురి చేస్తుంది. ఒక వ్యక్తి గంటల తరబడి ఫోన్ ముందు వంగి ఉండడం వల్ల అది వెన్నుపూసల మధ్య డిస్క్‌లపై మూడు నుంచి అయిదు రెట్లు ఎక్కువ ఒత్తిడి కలిగిస్తుందంటున్నారు వైద్యనిపుణులు.”



అణువంత ప్రోత్సాహంతో అంతులేనన్ని విజయాలు సాధిస్తామని నిరూపించారు. అపజయాలెన్ని ఎదురైనా వెరవకుండా లక్ష్యాన్ని సాధించి చూపారు. అమ్మానాన్నలు ఇచ్చిన ప్రోత్సాహం.. భరోసాతో దేశంలోనే అత్యున్నత సర్వీస్‌లలో ఒకటైన ఇండియన్ పోలీస్ సర్వీసెస్‌కు ఎంపికై శభాష్ అనిపించుకున్నారు. ఓ కూతురు కండక్టర్ అయిన తన తండ్రి కల నెరవేర్చితే... మరో కూతురు తన తండ్రి నుంచి పొందిన స్ఫూర్తితో సమాజ సేవకు సిద్ధమైంది. అమ్మ అండతో సాటి మహిళలకు భరోసాగా నిలిచే పోలీస్ అధికారి అవుతానని మరొకరు నిరూపించారు. నేషనల్ పోలీస్ అకాడమీలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న 174 మందిలో 77 ఆర్ఆర్ (రెగ్యులర్ రిక్రూటీస్) బ్యాచ్ ఐపీఎస్ అధికారులు నేడు నిర్వహించనున్న పాసింగ్ ఔట్‌పరేడ్‌తో బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా బ్యాచ్‌లోని ముగ్గురు మహిళా ఐపీఎస్‌ల మనోగతం... వారి మాటల్లోనే...

అమ్మ ఇచ్చిన భరోసాతోనే ముందుకు వెళ్లా!
- జయశర్మ

నేను ఐపీఎస్ అధికారి అయ్యానంటే అందుకు వందశాతం మా అమ్మే కారణం. నేను ఓటమి పాలైన ప్రతిసారి నాలో ధైర్యాన్ని నింపింది అమ్మ. ఒత్తిడిలో కూరుకుపోయిన ప్రతిసారీ నాకు భరోసా ఇచ్చి నన్ను ఇక్కడివరకు నడిపింది మా అమ్మ నీతూశర్మే. నా పేరు జయశర్మ. నా స్వస్థలం హర్యానాలోని హిస్సార్. మా నాన్న ప్రమోద్ కుమార్ శర్మ. నాన్న డిస్ట్రిక్ట్ ఫుడ్ సప్లై కంట్రోలర్‌గా పనిచేస్తున్నారు. అమ్మ గృహిణి. నేను ఢిల్లీ యూనివర్సిటీలో బీఎస్సీ మ్యాథ్స్ ఆనర్స్, ఐఐటీ ఢిల్లీ నుంచి ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ పూర్తి చేశాను. నాకు ఐపీఎస్ కావాలని చిన్ననాటి నుంచే కల. అమ్మ ప్రోత్సాహం, నాన్న అండతో నేను గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత సివిల్ సర్వీసెస్‌పై దృష్టి పెట్టా. ఇది ఎంతో కష్టమైన పని. కొన్నిసార్లు మనపై మనం నమ్మకాన్ని కోల్పోతాం. ఇది మన వల్ల కాదనిపిస్తుంది. అలాంటప్పుడు మనల్ని ప్రోత్సహించేవాళ్లు, భరోసా ఇచ్చేవాళ్లు ఎంతో అవసరం. నేను కూడా మూడుసార్లు సివిల్స్‌కి ఎంపిక కాకపోయినా నిరుత్సాహ పడలేదు. తప్పులు సరిచేసుకుంటూ ముందు వెళ్లా. ఐపీఎస్ ఎలాగైనా సాధించాలన్న నా పట్టుదలకు తోడు నా కుటుంబం, స్నేహితులు అండగా నిలిచారు. నాల్గో ప్రయత్నంలో నేను అనుకున్నట్టుగానే ఐపీఎస్‌కి ఎంపికయ్యాను.

నేషనల్ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ)లో శిక్షణ పూర్తిగా భిన్నమైంది. నేను ఎన్‌పీఏలోకి రాకముందు కనీసం వంద మీటర్లు కూడా పరిగెత్తినట్టు గుర్తు లేదు. కానీ ఇక్కడ శిక్షణతో ఇప్పుడు ఒంటిపై బరువు, చేతిలో రైఫిల్‌తో 40 కిలోమీటర్లు కూడా రన్నింగ్ చేసేంత స్థైర్యం వచ్చింది. మహిళా ఐపీఎస్ అధికారిగా మహిళా భద్రత, సైబర్ భద్రతపై ప్రత్యేక దృష్టి పెడతాను.

నాలుగుసార్లు ఓడినా.. నాన్న ప్రోత్సాహం తగ్గలేదు
- అశ్విని.ఎస్

మా స్వస్థలం తమిళనాడులోని కన్యాకుమారి. నాన్న బస్ కండక్టర్‌గా పనిచేసి ఈ ఏడాది రిటైర్ అయ్యారు. అమ్మ గృహిణి. మా అక్క ప్రైవేటు ఉద్యోగిని. మేం ఇద్దరమూ అమ్మాయిలమే అయినా.. నాన్న మమ్మల్ని అన్నింటిలో ప్రోత్సహించేవారు. నేను అన్నా యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేశాను. ప్రభుత్వ అధికారిగా ఉంటేనే సమాజానికి దగ్గరగా పనిచేయవచ్చని నాకు మొదటి నుంచి ఉండేది. అందుకే ఇంజినీరింగ్ తర్వాత ప్రైవేటు ఉద్యోగాలవైపు వెళ్లలేదు. తమిళనాడులో స్టేట్ జీఎస్టీ విభాగంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేశాను. కానీ.. నన్ను ఐపీఎస్ ఆఫీసర్‌ను చేయాలన్నది నాన్న కల. అయితే సివిల్స్‌కు ఎంపిక కావడం అంత సులువేం కాదు. ఐదో ప్రయత్నంలో ఐపీఎస్ సాధించానంటే నాన్న ఇచ్చిన ప్రోత్సాహమే కారణం. ఎప్పటికప్పుడు గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుంటూ, వ్యక్తిగతంగా నోట్స్ తయారు చేసుకుంటూ నా ప్రయత్నాన్ని కొనసాగించాను. చివరికి విజయం దక్కింది. ఎన్నో కొత్త విషయాలను నేర్చుకునే అవకాశంతోపాటు మనలో ఉన్న సామర్థ్యాన్ని మనకు తెలియజేస్తుంది నేషనల్ పోలీస్ అకాడమీ ట్రైనింగ్. ఈ శిక్షణ తర్వాత నేను ఎంతో భరోసాగా చెప్పగలను – పోలీస్ ఉద్యోగం మహిళలు కూడా ఎంతో బాగా చేయగలరని! మా బ్యాచ్‌లో కూడా 65 మంది మహిళా ఐపీఎస్‌లు ఉండడమే అందుకు ఉదాహరణ. సివిల్స్‌కి ప్రిపేర్ అవుతున్న వాళ్లకి నా సలహా ఒక్కటే..సివిల్స్ సాధించడం అనేది మీ లక్ష్యం అయితే, ఎన్ని అడ్డంకులు వచ్చినా మధ్యలో వదలొద్దని ముందే నిర్ణయించుకోవాలి. ఒత్తిడి లేకుండా ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సిద్ధం కావాలి. అప్పుడు విజయం మనదే.

నాకు స్ఫూర్తి మా నాన్నే
- కీర్తియాదవ్


నాన్న ఎయిర్‌మెన్‌గా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పని చేసి రిటైర్ అయ్యారు. ఇంట్లో ఎంతో క్రమశిక్షణ ఉండేది. నా చిన్నప్పటి నుంచి నాన్నను అలా యూనిఫాంలో చూస్తూ పెరగడంతో నాకు కూడా యూనిఫాం సర్వీసెస్ అంటే ఎంతో గౌరవం ఏర్పడింది. ఆయనే నాకు ఎప్పటికీ స్ఫూర్తి. స్కూలింగ్ పూర్తయి, కాలేజీకి వచ్చాక నాకు స్పష్టత వచ్చింది ఐపీఎస్ అధికారి అయితే ప్రజలకు నేరుగా సేవ చేసే అవకాశం ఉంటుందని. అందుకే ఎప్పటికైనా ఐపీఎస్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళ్లా. అయితే గ్జేవియర్స్ కాలేజ్ కోల్‌కతా నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తయి తర్వాత నేను మొదటి ప్రయత్నంలో సీఐఎస్ఎఫ్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా ఎంపికయ్యాను. 2020లో ట్రైనింగ్ చేస్తూనే సివిల్స్ ప్రిపరేషన్ కొనసాగించాను. ఆ తర్వాత ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్‌కు ఎంపికయ్యాను. అయినా, ఐపీఎస్ కలను వదల్లేదు. నాల్గో ప్రయత్నంలో నాకు ఐపీఎస్ వచ్చింది. నాన్న ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేయడం.. మొదటి నుంచి ఎంతో క్రమశిక్షణతో పెరగడంతో ఇక్కడి ట్రైనింగ్ కష్టంగా అనిపించలేదు. సులువుగానే శిక్షణ పూర్తి చేశా. ఇక్కడ నేర్చుకున్న విషయాలు వృత్తిగతంగానే కాకుండా వ్యక్తిగతంగా నన్ను ఎంతో మార్చాయి. నాకు తెలంగాణ పోలీసులో మహేశ్ భగవత్ ఇన్‌స్పిరేషన్. ఐపీఎస్ అధికారిగా నేను మహిళా భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాను. నేను హర్యానాలో పుట్టిపెరిగాను. అక్కడి పరిస్థితులు చూశాక..మహిళా భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నా.

– నాగోజు సత్యనారాయణ, స్టేట్ క్రైమ్ రిపోర్టర్, సాక్షి, హైదరాబాద్
ఫొటోలు : ఏ. జాన్

● నయా వంచన | డిజిటల్ మోసాలు

పండగ రోజులు కదా...
ఎర వేస్తారు!

స్టే స్మార్ట్ స్టే సేఫ్



పండగ కదా.... ఆన్‌లైన్ షాపింగ్ ప్రయత్నాలలో ఉన్నప్పుడు 'ఫ్రీ దీపావళి గిఫ్ట్' అంటూ పాపప్ కనిపించవచ్చు. 'ఈ ప్రశ్నలకు జవాబు చెప్పి దీపావళి బహుమతులు గెలుచుకోవచ్చు' అనే ప్రకటన మెరుపులా మెరియవచ్చు.

దీపావళిని పురస్కరించుకొని దుస్తుల నుంచి వస్తువుల వరకు ఆన్‌లైన్ షాపింగ్ ఊపందుకుంటుంది. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ మోసగాళ్లకు చేతినిండా పనే!

పండగ రోజుల్లో ఆన్‌లైన్ స్కామ్‌లు ఎక్కువగా జరగడానికి అవకాశం ఉంది. నకిలీ ఈ-మెయిల్స్, టెక్ట్స్, కాల్స్ ద్వారా స్కామ్‌లు జరుగుతుంటాయి. ఈ పండగ సీజన్‌లో మోస్ట్ కామన్ స్కామ్... నకిలీ ఆర్డర్ లేదా అకౌంట్. మీ అకౌంట్ తాత్కాలికంగా నిలిపివేయబడిందని, ఆర్డర్‌కు పేమెంట్ వెరిఫికేషన్ అవసరమని పేర్కొంటూ హానికరమైన లింక్‌లను క్లిక్ చేసేలా, వ్యక్తిగత వివరాలు షేర్ చేసే విధంగా కస్టమర్‌లను ప్రేరేపిస్తారు.

'గత సంవత్సరం 55,000 ఫిషింగ్ వెబ్‌సైట్‌లను, 12,000 స్కామ్ ఫోన్ నంబర్లను బ్లాక్ చేశాం. పండగ సీజన్ ముందు ఆన్‌లైన్ స్కామ్‌లపై వినియోగదారులకు అవగాహన కలిగించడానికి ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్‌తో కలి పనిచేశాం' అన్నారు అమెజాన్ ఇండియా, వైస్ ప్రెసిడెంట్ (లీగల్) రాకేష్ బక్షీ.

'స్కామర్‌లు నకిలీ షాపింగ్ వెబ్‌సైట్‌లను లేదా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లాంటి ప్రసిద్ధ బ్రాండ్‌లను అనుసరించి ఆన్‌లైన్ ప్రకటనలను సృష్టిస్తారు. నమ్మశక్యం కాని డిస్కౌంట్‌లతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తారు. పరిమిత కాల ఆఫర్‌లతో కస్టమర్‌లను ఆకర్షిస్తారు. ఒక కస్టమర్ ఆర్డర్ చేసి చెల్లింపు చేసిన తర్వాత నకిలీ ప్రాడక్ట్స్ అందుతాయి. అసలు ఏమీ అందకపోవచ్చు కూడా. నకిలీ వెబ్‌సైట్‌లు తరచుగా అధికారిక బ్రాండ్ లోగోలు, ప్రాడక్ట్ ఇమేజ్‌లను, చట్టబద్ధమైన సైట్‌లను తలపించేలా పాలిష్ చేసిన డిజైన్‌లను ఉపయోగిస్తాయి. కొందరు నిజమైన వెబ్‌సైట్‌ల లేఅవుట్, డొమైన్ పేరును కూడా క్లోన్ చేస్తారు. తేడాను గుర్తించడం కష్టంగా ఉంటుంది' అంటున్నారు సైబర్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్ శుభంసింగ్.

చాలామంది స్కామర్‌లు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లాంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఫేక్ 'గివ్ అవే' పోటీలు లేదా లక్కీ డ్రాల గురించి పోస్ట్ చేస్తారు. మీ బ్యాంక్ వివరాలను షేర్ చేయమని లేదా క్లెయిమ్ యువర్ ప్రైజ్ లింక్‌పై క్లిక్ చేయమని అడగవచ్చు. వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని ఎప్పుడూ షేర్ చేయవద్దు.

అనుమానాస్పద ఎకౌంట్‌ల గురించి వెంటనే రిపోర్ట్ చేయండి. బ్లాక్ చేయండి. బ్యాంక్ స్టేట్‌మెంట్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోండి.

స్త్రీ హెల్త్‌పై దృష్టిపెట్టాలి


కృతిసనన్

చలం, అంబేద్కర్‌ల నుంచి నటి, ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్ (యూఎన్ఎఫ్‌పీఏ) జెండర్ ఈక్వాలిటీకి ఈ దేశపు రాయబారి కృతిసనన్ దాకా అందరి మాటా ఒకటే స్త్రీ ఆరోగ్యమే దేశ భవిష్యత్ భాగ్యం అని!

నిజానికి మహిళా ఆరోగ్యం, లింగ సమానత్వం గురించి మాట్లాడుకోవడానికి ప్రత్యేక సందర్భం అక్కర్లేదు.. అయినా ఈ ప్రస్తావనకు ప్రత్యేక సందర్భమూ ఉంది. అదే బెర్లిన్ (జర్మనీ)లో జరిగిన వరల్డ్ హెల్త్ సమ్మిట్ 2025. ఇందులో ఆమె మహిళల ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టాల్సిన అవసరం గురించి మాట్లాడారు. ఇలా వరల్డ్ హెల్త్ సమ్మిట్‌లో ప్రసంగించిన తొలి భారతీయ నటిగా కీర్తి గడించారు. ఆ ప్రసంగంలో కీర్తి సనన్ ఏం మాట్లాడారంటే..

'మహిళల ఆరోగ్యం నిర్లక్ష్యం చేయాల్సిన లేదా పక్కన పెట్టాల్సిన విషయం కాదు. తక్షణమే దృష్టిపెట్టాల్సిన అత్యంత అవసరమైన అంశం. ఆమె ఆరోగ్యం.. మానవాళి ప్రగతికి, భవిష్యత్‌కు మూల స్తంభం. అందుకే మహిళా ఆరోగ్యానికి సంబంధించి సుస్థిరమైన పెట్టుబడులు కావాలి. ఆవిష్కరణలు జరగాలి. ఇందుకోసం చేసే ప్రతి ప్రయత్నం అద్భుతమైన ఆర్థిక, సామాజిక మార్పులుగా ప్రతిఫలిస్తుంది. ఏటా ముప్పై కోట్లు ఇన్వెస్ట్ చేస్తే పదమూడు వందల కోట్ల రాబడి కనిపిస్తోంది. అంటే దాదాపు తొమ్మిది రెట్ల లాభం. ఈ ఇన్వెస్ట్‌మెంట్ నైతికావసరమే కాదు మన మూకుమ్మడి భవిష్యత్‌కు భరోసా కూడా! ఎందుకంటే మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు, సమాజం.. ఆరోగ్యంగా ఉంటాయి. ఆరోగ్యవంతమైన సమాజం ఆర్థిక సుస్థిరతకు చిహ్నం. కానీ ప్రపంచ జనాభాలో సగంగా ఉన్న మహిళల ఆరోగ్యం ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతూనే ఉంది. యూఎన్ఎఫ్‌పీఏ జెండర్ ఈక్వాలిటీ అంబాసిడర్‌గా చాలా ప్రాంతాలు తిరిగాను. అవన్నీ కూడా బాల్యవివాహాలకు సాక్ష్యంగా కనపడ్డాయి. అమ్మాయిలకు మానసిక ఆరోగ్యం సంగతి అటుంచి కనీసం శారీరక ఆరోగ్య కేంద్రాలు కూడా అందుబాటులో లేని దుస్థితిలో ఉన్నాయి. వీళ్ల జీవితాలు మారాలంటే మహిళల ఆరోగ్యానికి సంబంధించి దృష్టి పెరగాలి. తక్షణమే ఆ దిశగా కార్యాచరణ నిర్ణయాలు జరగాలి' అన్నారు కృతిసనన్.

ఫ్యాషన్

పండగలకు, సంప్రదాయ వేడుకలకూ నిండైన హుందాతనాన్ని తీసుకువచ్చేలా కట్టూ బొట్టు విషయంలో అతివలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారు. ఈ దీపావళి వేళ మరింత స్పెషల్‌గా కనిపించాలనుకునే వారికోసం బెంగాలీ చీరకట్టు ఆధునికతనూ అద్దుకొని కొంగొత్తగా మెరిసిపోతుంది. సెలబ్రిటీలూ ముచ్చటపడే ఈ కట్టుకు వారు జోడించే హంగులు ఇవి...

పండగంతా నిండుగా...



పండగలు, ఇతర సంప్రదాయ వేడుకలలో బెంగాలీ స్టైల్ చీర కట్టును దేశవ్యాప్తంగా మహిళలు ధరించడానికి ఇష్టపడుతున్నారు. ఉత్తేజాన్ని కలిగించే ఎరుపు–తెలుపు కాంబినేషన్‌లో ఉండే ఈ చీర కట్టు, నుదుటన పెద్ద బిందీ, శంఖం ఆకృతిలో నెక్ డిజైన్, చీర పల్లూకున్న అందమైన డిజైన్.. ఇవన్నీ పండుగను మరింత ప్రత్యేకంగా చేస్తాయి. దుర్గాపూజల సమయాల్లో ఈ రంగు చీరలను బెంగాలీలు ప్రత్యేకంగా ధరిస్తారు. ఆ స్టైల్ కట్టును ఇప్పుడు లక్ష్మీ పూజలు, వివాహ వేడుకల సమయాల్లో ధరించడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే, ఈ కట్టును మనం అనుసరించాలంటే మాత్రం ఈ సూచనలు తప్పక అవసరం.

హెయిర్ స్టైల్- మేకప్
హెయిర్ స్టైల్ కోసం ఒక బన్ తయారు చేసి, దానిని మల్లె పువ్వులు లేదా ఎరుపు, తెలుపు పువ్వులతో అలంకరించవచ్చు. పువ్వులతో కాకున్నా హెయిర్ బన్‌కు హెయిర్ పిన్ జ్యువెలరీని జోడించడం ద్వారా అందాన్ని పెంచుకోవచ్చు. మేకప్ కోసం ఎరుపు లిప్‌స్టిక్, తేలికపాటి ఐ మేకప్ సరిపోతాయి. ధరించిన చీరకు మేకప్ సెట్ అవుతుందా అనేది సరి చూసుకుంటే చాలు. మెడలోనూ, చేతులకు ఎక్కువ నగల లేకుండా చూసుకుంటే చాలు. మీ రూపం ఆధునికతను అద్దుకున్న సంప్రదాయంతో కొంగొత్తగా మెరిసిపోతుంది.



ఎంపికలో సరైన చీర
పూజలు, నోములు, వ్రతాల సమయంలో ఎరుపు అంచుతో ఉన్న తెలుపు లేదా ఆఫ్-వైట్ బేస్ చీరను ఎంచుకోవాలి. అంచు ఉన్న కాటన్, పట్టు లేదా టస్సర్ చీరలు ఈ బెంగాలీ లుక్‌కు సరైనవి. వీటిలో మనవైన చేనేతలు కూడా ఉండవచ్చు. ఈ చీరకట్టు సౌకర్యంగా ఉండటమే కాకుండా పూజ, పండగల సమయాల్లో రోజంతా ధరించడం సులభం కూడా.



కట్టుతో కట్టడి
బెంగాలీ స్టైల్‌లో నిజమైన ఆకర్షణ దాని డ్రేపింగ్ శైలిలోనే ఉంటుంది. చీర కుచ్చిళ్ల నుంచి ఎడమ వైపుగా, పొడవాటి పల్లూను ఛాతీ మీదుగా భుజం వరకు తీసుకుంటూ వెళ్లాలి. పొడవాటి పల్లూ భాగాన్ని కుడి చేతి భుజం కిందుగా తీసి, పైకి అంచు భాగం కనిపించేలా బ్లౌజ్‌కు జత చేయాలి. పొడవుగా తీసుకున్న కొంగు భాగాన్ని కుడి చేత్తో ముందుకు తీసుకువచ్చి పట్టుకోవడం కూడా ఈ కట్టులో అందంగా కనిపిస్తుంది. భుజం మీదుగా తీసిన పల్లూని కొప్పుకు అటాచ్ చేసి, ఎడమ భుజం కిందుగా తీసుకురావచ్చు. ఈ కట్టు లలనల రూపాన్ని మరింత సంప్రదాయంగా మారుస్తుంది. డ్రేపింగ్ చేసేటప్పుడు, కుచ్చుల భాగం మడతలు లేకుండా సెట్ చేసి, పల్లూ చాలా తేలికగా ఉన్నట్టు చూసుకోవాలి.

నగలపై ప్రత్యేక శ్రద్ధ
పెద్ద పెద్ద చెవిపోగులు, గాజులు, నెక్లెస్‌లు ఈ స్టైల్ చీరకట్టుకు రాయల్ టచ్‌ను జోడిస్తాయి. హెవీగా ఆభరణాలు అక్కర్లేదు అనుకుంటే పెద్ద చెవిపోగులు, గాజులు ఈ అలంకరణకు సరిపోతాయి.

గుండ్రని వెడల్పాటి బిందీ
బెంగాలీ స్టైల్ డ్రేపింగ్ సంపూర్ణం కావాలంటే నుదుటన పెద్ద, గుండ్రని ఎరుపు బిందీ తప్పక ఉండాలి. ఇది పండుగల రోజుల్లో మొత్తం మేకప్‌ను పూర్తి చేస్తుంది. నుదుటిపై బిందీతో పాటు సిందూర్ చుక్కలను కూడా అదనంగా పెట్టడం వల్ల లుక్ మరింత మెరుగవుతుంది. ఈ లుక్‌కి ఎరుపు లేదా ముదురు గులాబీ రంగు బిందీ ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

● టెక్నాలజీ

ఇంటిపని నుంచి తోటపని వరకు...
ఫిగర్ వో 3





'ఫిగర్ ఏఐ' అనేది హ్యూమన్ రోబోలకు సంబంధించిన స్టార్టప్. తాజాగా 'ఫిగర్ వో 3' అనే హ్యూమన్ రోబో గురించి ప్రకటించింది కంపెనీ. 'రోజువారీ అవసరాలకు ఉపయోగపడే సాధారణ హ్యూమనాయిడ్ రోబో ఇది. గదిని శుభ్రం చేయడం, మొక్కలకు నీళ్లు పెట్టడం, ఆహారాన్ని వడ్డించడం, గిన్నెలు కడగడం, బట్టలు మడత పెట్టడం...మొదలైన ఎన్నో పనులు చేస్తుంది' అని 'ఫిగర్ వో 3' వివరాలు వెల్లడి చేసింది కంపెనీ. కాలిఫోర్నియాకు చెందిన 'ఫిగర్ ఏఐ' స్టార్టప్ మునుపటి తరం హ్యూమనాయిడ్‌లతో పోల్చితే సరికొత్త, సాంకేతికంగా ఒక అడుగు ముందుండే హ్యూమనాయిడ్స్ దృష్టి పెట్టింది. పూర్తిగా రీడిజైన్ చేసిన సెన్సరీ సూట్, హ్యాండ్ సిస్టమ్, నెక్స్ట్ జనరేషన్ విజన్ సిస్టమ్‌తో ఈ సరికొత్త హ్యూమనాయిడ్ రోబో మార్కెట్‌లోకి అడుగు పెట్టనుంది.

బులియన్
బంగారం 10 గ్రా.; వెండి కిలో
అక్టోబర్ 16న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,31,900	1,31,320	1,29,440	1,31,320	1,31,300	1,29,810
బంగారం (22 క్యారెట్లు)	1,22,790	1,18,650	1,18,650	1,22,210	1,20,800	1,19,000
వెండి	1,90,000	1,82,900	2,06,000	1,82,900	1,80,000	2,06,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.